# క్రైం కథ

# పోలీస్ డాగ్

''పోలీస్ డాగ్ జాకీ బాగా అనారోగ్యంతో బాధపడ్తోంది. ఏమీ పెట్టినా తినడం లేదు. దీన్ని పట్టుకుని మనం నేర పరిశోధన ఏమీ చేయగలం? అధికారులు కుక్కల విషయంలో అసలు పట్టించుకోరు. మన వద్ద వున్న కుక్కలన్నీ బాగా ముసలివైపోయాయి. ఈ మధ్య జంట హత్యల కేసులో జాకీనే వాడారు. అది హంతకుడు వదిలివెళ్లిన వస్తువులు వాసన చూసి పరుగులు తీసింది. రెండు మూడు చోట్లకు వెళ్లింది. అక్కడ హంతకుడి కోసం స్పెషల్ టీమ్ వెదికింది. హత్యాయుధం దొరికింది. హతులు చంపబడినది ఆ ఆయుధంతో అని నిర్ధారించారు. కానీ, అక్కడ్నుంచి ఇది ఒక్క అడుగు కదల్లేదు. దీన్ని ఆ రోజు స్పెషల్ టీమ్ కనీసం ఎనిమిది కిలోమీటర్లు పరుగెత్తించినందున ఇలా అయ్యింది. దీనికి కాళ్లు పట్టేసాయి. ఆ తరువాత ఇది ఎలాంటి ఆహారం ముట్టుకోలేదు. యానిమల్ డాక్టర్ చూసి ఇది నాలుగైదురకాల రుగ్మతలతో బాధపడ్తోంది. ఇక పోలీస్ వాచ్‌కు పనికిరావు అని చెప్పేసాడు. దాంతో దీన్ని రెస్క్యూ సెల్‌కి అధికార్లు పంపేయమంటున్నారు. ఇన్నాళ్లు దీన్ని నేను పెంచాను. చూస్తూ ఎలా కుక్కల సంరక్షణాలయంకు పంపగలను. అక్కడ నరకమే'' ఒక కానిస్టేబుల్ చెప్పాడు. మిగిలిన ఇద్దరూ ఆసక్తిగా విన్నారు.

''పోనీ నీవే ఇంటికి తీసుకుపోరాదు. జాకీ అంటే నీకు చాలా ఇష్టం అందుకే ఇంతగా బాధపడ్తున్నావు. మన డిపార్టుమెంటు పనికి వచ్చినన్నాళ్లు వాడుకుంటారు. ఆ తరువాత వదిలేస్తారు. కనీసం దీనికి మందులు కూడా ఇప్పించే ఆలోచనలో లేరు''కానిస్టేబుల్ సలహా ఇచ్చాడు.

''ఇది తేరుకుంటే దీన్ని పెంచడం నావంటి కానిస్టేబుల్ వలన జరిగేది కాదు. ఎవరైనా పార్టీని చూడాలి. ఇది పోలీస్ ఫైల్‌లో మరుపురాని కుక్క. ఎన్ని హత్యల కేసులో డీల్ చేసింది. ఎంత మంది హంతకులనో పట్టుకుంది. తలచుకుంటే గగుర్పాటు కలిగిస్తుంది.'' చెపుతుండగా సెల్‌ఫోన్ మ్రోగింది.

''నేను రెహ్మాన్‌ను మాట్లాడుతున్నాను. జాకీకి ఎలా వుంది? కుదుటపడిందా? అధికారులు ఏమి చెప్పారు?''

''రెహ్మాన్ నేనే నీకు రింగ్ చేద్దామనుకుంటుండగా నీవే చేసావు. జాకీ సేవలకు దాదాపు మా డిపార్ట్‌మెంటు గుడ్‌బై కొట్టేసింది. నీవు కావాలంటే తీసుకుపోవచ్చు. రాగలిగితే ఇప్పుడే వచ్చేయ్! లోపల అధికార్లున్నారు. వారు నువ్వు అడిగితే ఇచ్చేస్తారు.''

''ఇదిగో వస్తున్నా. ఫార్మాలిటీస్ పూర్తిచేసుకొని తీసుకుపోతాను. జాకీని ఎలాగైనా ఎంత ఖర్చయినా బాగు చేయించి దాని ద్వారా నాలుగు పిల్లలు పుడితే పెద్దధరకు అమ్ముడుపోతాయి. అలాంటి తెలివైన కుక్కలను మనం వృద్ధి చేయాలి'' చెప్పి పెట్టేసాడు రెహ్మాన్. అక్కడ కానిస్టేబుల్సులో ఏదో తెలియని ఆనందం అలుముకుంది. కొద్దిసేపటిలో జబ్బుపడిన ముసలి కుక్క జాకీ తన పదేళ్ల సర్వీసును కేవలం తిండికోసం చేసి చివరకి కుక్కపిల్లలను అమ్ముకునే రెహ్మాన్ చేతిలోకి తేలిగ్గా వెళ్లిపోయింది.


రెహ్మాన్ జాకీని నలుగురైదుగురు వెటర్నరీ డాక్టర్లకు చూపించి మందులు ఇప్పించి వారంలోగా అది ఇంత ముద్ద తినేట్టు చేసాడు. మరో వారంలో అది తిరుగాడసాగింది. రెహ్మాన్ ఇంటిలో చాలా వరకు కుక్కపిల్లలు వుంటాయి. కలకత్తా నగరంలో జాతి కుక్కలు అనేకం వున్నాయి. కుక్కలు పుడితే చాలా వరకు రెహ్మాన్ సెల్‌కు కాంటాక్టు చేసి అమ్మేస్తారు. వాటిని తిరిగి లాభానికి అమ్ముకుంటాడు. పోలీస్ డాగ్సును చివరిలో రెహ్మాన్ తెచ్చుకుని వాటిద్వారా, సంతానోత్పత్తి చేయించి ఆ పిల్లలను పెద్ద ధరకు అమ్ముకుంటాడు. ఇదే అతని జీవనాధారం.

జాకీ ఇప్పుడు కింగ్‌లా తయారయ్యింది. అయితే దాని కుడి కన్నులో పువ్వు వేసింది. ఎడమ కన్నుతో మాత్రమే అంతంత మాత్రంగా చూడగలుగుతుంది. ముందు కాలు ఒకటి సరిగ్గా నేల మీద ఆనదు. కుంటుతున్నట్లు నడుస్తుంది. చాలా చురుగ్గా వుంటుంది. దాన్ని గొలుసు కట్టి తన వెంట మార్కెట్‌కు, సోనాగాచిలో తిప్పుతుండేవాడు. జాకీ గురించి లోకల్ పత్రికలో పెద్ద కథనం వెలువడింది. రెహ్మాన్ కావాలనే జాకీ గురించి మీడియాకు చెప్పి మరీ వేయించాడు. త్వరలో జాకీ తండ్రి కాబోతోంది. అని కూడా ఆ వార్తా కథనంలో రావడంతో కుక్కలను పెంచేవారికి ఎంతో ఆసక్తి కలిగి రెహ్మాన్‌కు ఫోన్ చేసి ముందే ఆ పిల్లల కోసం అడ్వాన్సులు ఇచ్చేసారు. పుట్టేవి నాలుగో ఐదో అయితే రెహ్మాన్ కనీసం యాభై మంది వరకూ అడ్వాన్సులు తీసుకొని డాబర్‌మన్ జాతికి చెందిన పిల్లలను ఎక్కడెక్కడో కొని తెచ్చి జాకీ పిల్లలనే చెప్పి వ్యాపారం చేయడానికి రంగం సిద్ధం చేసుకున్నాడు. జాకీ తండ్రి కానక్కర్లేదు. ఇదీ రెహ్మాన్ కుక్కల వ్యాపారం.

★★★

పోలీస్ క్రైం మీటింగ్‌లో రెండు నెలల క్రితం జరిగిన జంటహత్యల కేసు ఇంతవరకు ముడి విప్పనందుకు ఆ ఠాణా పరిధిలో పోలీసులను నిలదీసారు పై అధికారులు. హత్యలు జరిగిన రోజు పోలీస్‌డాగ్సు చూపిన హత్యాయుధం తప్పితే మనం స్వంతంగా సాధించింది ఏమీ లేదు. ఇలా అయితే మనం రేపు జనాలకు ఏమి చెప్పగలం. ఇతరత్రా క్లూ సంపాదించలేకపోయారు. హత్యాయుధం మీద లభించిన వేలిముద్రలు కూడా మన కంప్యూటర్‌లో నిక్షిప్తమైన వేలిముద్రలతో సరిపోల్చితే హంతకుడు ఫలానా అని తెలిసిరాలేదు. దీని బట్టి హంతకుడు కొత్తవాడు. కానీ, చాలా పకడ్బందీగా చేసాడు. ఏ ఒక్క ఆధారం వదలిపోలేదు. అధికారుల మాటలు డిటెక్టివ్ విజయ్‌సింగ్ చెవుల్లో గింగురుమనసాగాయి. జాకీ అనే కుక్క గురించి పత్రికలో పడిన క్లిప్పింగ్ కూడా టేబిల్ మీద వుంది. అది చదివి జీపులో రెహ్మాన్ ఇంటికి వెళ్లాడు.

అక్కడ చాలా కుక్కపిల్లలున్నాయి. రెహ్మాన్ కొనేవారితో బిజిగా వున్నాడు. ఓ మూల జాకీ పడుకుని వుంది. దాన్ని చూసి విజయ్ ఆలోచిస్తూ కూర్చున్నాడు. జాకీకి ఎవరో తట్టిలేపినట్లు కళ్లు విప్పి లేచి తోక ఊపుతూ నాలుక చాపుకుని ఆసక్తిగా విజయ్‌ను చూసింది. దాంతో రెండు మూడు కేసుల్లో అతడు దాంతో తిరిగాడు. దగ్గరగా వెళ్లి దాని తలనిమిరాడు. దాని మెడ మీద గొలుసు వొరుసుకుని పోయి రక్తం కారి గడ్డకట్టుకుని పోయి వుంది. ఎందుకో మనస్సు చివ్వుమంది. రెహ్మాన్‌నుపిలిచి అడిగాడు.



''ఏమిటయ్యా దీన్ని ఉద్ధరిస్తానని చెప్పి తీసుకొచ్చి ఇలా చేసావు. గొలుసు కట్టకుండా ఏదైనా బోనులో పెట్టలేకపోయావా? చూడు ఎలా నెత్తురు గాయం అయ్యిందో. నీ వద్ద కోలుకుంది. దీని కోసం నీవు బాగా ఖర్చు చేసావని కానిస్టేబుల్స్ చెబితే చాలా ఆనందించాను. దీన్ని ఒకసారి తీసుకొని వెళ్లానుకున్నా. కానీ, దీని పరిస్థితి చాలా ఘోరంగా వుంది. ఇలా ఎందుకు అయ్యింది?''

''సార్..దీని కోసం చాలా ఖర్చు చేసాను. బాగానే తయారయ్యింది. అయితే ఇది రెండురోజుల నుంచి అర్ధరాత్రి వేళ గొలుసు తెంచుకు పారిపోయే ప్రయత్నంలో వుంది. అందుకే మెడ వద్ద చర్మం చిట్లి రక్త స్రవిస్తోంది. ఉదయాన్నే గొలుసు విప్పితే ఎటూ పోదు మరి రెండురాత్రులు ఇలా ఎందుకు ప్రవర్తించిందో అర్థం  కావడం లేదు.'' వినయంగా చెప్పాడు.

విజయ్‌సింగ్ ఆలోచనలో పడ్డాడు. ఒకసారి పరిసరాలు గమనించాడు. రెహ్మాన్ ఇంటి ఎదురుగా ఒక రెస్టారెంట్ వుంది. తప్పితే ఇతరత్రా ఏమీ లేదు.

''సార్ నా వద్ద నుంచి మళ్లీ జాకీని ఎందుకు తీసుకువెళ్లాలనుకున్నారు? దీనికి కళ్లు సరిగా కన్పించవు''అని నాన్చాడు.

''ఇదే హత్యాయుధం చూసింది. దీన్ని ఆ ప్రదేశంలో వదిలితే ఏమైనా దొరుకుతుందా అని ఆశ. వాస్తవానికి రెండునెలలు అయ్యింది కనుక దీనికి అంత వాసన శక్తి వుండదు. కానీ మా ఆశ. ఇలాంటివి పోలీసులకు తప్పవు. సరే దీని పరిస్థితి ఇలా వుంటే నాకేం సాయం చేస్తుంది. వస్తాను. అని చెప్పి వెనుదిరిగాడు. ఆ రాత్రి వరకు జాకీ గురించే ఆలోచించాడు.

అర్ధరాత్రి వేళ జీపు రెహ్మాన్ ఇంటిముందు ఆపాడు. కట్టి వున్న జాకీ భయంకరంగా అరుస్తోంది. దాన్ని చీదరించుకుంటున్నాడు. రెహ్మాన్ కుటుంబీకులు. జాకీ ఎటు చూసి అరుస్తుందా? అని విజయ్ చూసాడు. రెస్టారెంట్ వైపు చూసి రెచ్చిపోతోంది. వెంటను కట్టు విప్పాడు. అంతే! లోగడ దూకిన విధంగా రెస్టారెంటులోకి దూసుకుపోయింది. దాని వెనుకనే పరిగెత్తాడు. ఒక్కసారి కుక్క అరుపు దూరం కావడంతో మంచం మీద పడుకుని చెవులు మూసుకున్న రెహ్మాన్ బయటకి వచ్చి చూసాడు.

రెస్టారెంట్‌లో కూర్చుని తాగుతున్న నలుగురిపై దుమికి ఒకడ్ని అదేపనిగా కరిచి దుస్తులు చీలికలు, పీలకలు చేయసాగింది. బాగా తాగి వున్నందున ఆగంతకుడు పెద్దగా జాకిని నివారించలేకపోయాడు. విజయ్ కుక్కను అదుపుచేసి అప్పటికి రక్తసిక్తమైన ఆగంతకున్ని పట్టుకున్నాడు. వెంటనే పోలీసులను రప్పించి నలుగురిని అరెస్ట్ చేసాడు. వారు ఏదీ దాచకుండా ఒప్పుకున్నారు. ఇటీవల కిరాయికి జంట హత్యలు చేసిన వారిలో జోసఫ్ అనే వాడు చాలా తెలివిగా ఎలాంటి ఆధారం లేకుండా చేసినట్లు చెప్పాడు. శివార్లలో వున్న రెస్టారెంట్లకే పరిమితం అయ్యాం. అర్ధరాత్రి వేళ ఈ మధ్య రెండురోజులుగా ఇక్కడికి వచ్చాం. ఊహించని విధంగా దొరికిపోయాం. గత రెండురాత్రులు ఎదురింటి కుక్క అరిచింది. ఎందుకో అనుకున్నాం. మమ్మల్నే పట్టుకుంటుంది అనుకోలేదు. మా బాడ్ లక్. లేకుంటే రేపే ముంబాయ్ వెళ్లిపోయేవాళ్లం'' చెప్పి నిట్టూర్చాడు.

విజయ్‌లో పాదరసం లాంటి నేరపరిశోధన విధానాన్ని అధికారులు మెచ్చుకున్నారు.

**- యర్నాగుల సుధాకరరావు**